క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

ఇల్లంతకుంట: రాష్ట్రంలోని స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు నాలుగోతరగతి చదివిన ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులు ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని మండల విద్యాధికారి సీహెచ్ శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం తెలిపారు.
ముస్తాబాద్: తెలంగాణ క్రీడా ప్రాధికారిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే స్పోర్ట్స్ స్కూల్ ఎంపికకు పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈవో నిమ్మ రాజిరెడ్డి తెలిపారు. మండలంలోని పీఈటీలు, పీడీలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. నాలుగోతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థుల కోసం ఈనెల 17, 18ల్లో స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశాలకు పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు.
కోనరావుపేట: 2025–26 విద్యాసంవత్సరానికి గాను స్పోర్ట్స్ స్కూల్‌లో నాలుగోతరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి మురళీనాయక్ ఒక ప్రకటనలో కోరారు.

ఐటీఐలో ప్రవేశాలు

తంగళ్లపల్లి: మండెపల్లిలోని ప్రభుత్వ ఐటీఐలో 2025–26 విద్యాసంవత్సరానికి ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.కవిత శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జూన్ 26 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తామని.. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్ మోటార్ వెహికల్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, వెల్డర్, మెకానిక్ డీజిల్, ఫ్యాషన్ డిజైనింగ్ టెక్నాలజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.
కేజీబీవీలో..
బోయినపల్లి: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల, కళాశాలలో 2025–26 విద్యాసంవత్సరానికి గాను ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలు ప్రారంభమైనట్లు ప్రత్యేకాధికారి ఎం.లింగవ్వ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌లో బైపీసీ, ఎంఎల్‌టీ(మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్) కోర్సులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

వేములవాడ: పట్టణంలోని భగవంతరావునగర్‌లో అద్దెకుంటున్న పద్మ వారం క్రితం ఇంటికి తాళం వేసి పుట్టింటికి వెళ్లింది. శుక్రవారం ఇంటికొచ్చే సరికి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లో దాచిన దులోని తులంనర బంగారు ఆభరణాలు, 12 తులాల పట్ట గొలుసులు దోచుకెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది.
5 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత
వేములవాడ బైపాస్‌రోడ్డులోని సాయిరక్ష దాబా ప్రాంతం నుంచి అక్రమంగా తరలుతున్న 5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

ముస్తాబాద్: తుర్కపల్లి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి పర్శరాములు, నాయకులు కర్రొల్ల నర్సయ్య, అజయ్, కుమార్, ఎల్లయ్య, విజయ, రాజవ్వ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నివాళి



నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

వీర్నపల్లి: అహ్మదాబాద్ విమాన దుర్ఘటనలో మృతిచెందిన పౌరుల ఆత్మకు శాంతి చేకూరాలని గర్జనపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. ప్రధానోపాధ్యాయులు వెంగల శ్రీనివాస్, గజన్, ఉపాధ్యాయులు ప్రేమ్‌సాగర్, బలరాం నాయక్, మంజుల, శ్రీనివాస్, కవిత, శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు బోనాలు



కోనరావుపేట: కొలనూర్‌లో యాదవ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. బీరప్పస్వామి, మహంకాలమ్మ ఉత్సవ మూర్తులతో ఊరేగింపు నిర్వహించి నైవేద్యం సమర్పించారు.

పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను తొలగిస్తాం

సాక్షి స్పందన

ఎల్లారెడ్డిపేట: రాచర్లబొప్పాపూర్ శివారులో సింగసముద్రం సాగునీటి కాలువల్లో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను వెంటనే తొలగించి ఆయకట్టు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని నీటిపారుదల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ కిశోర్ శుక్రవారం తెలిపారు. సాక్షి దిన పత్రికలో సాగునీటి కాలువలు ముళ్లపొదలతో నిండిపోయాయనే శీర్షికతో వచ్చిన కథనంపై నీటిపారుదల శాఖ అధికారులు స్పందించారు.

విద్యార్థికి అభినందనలు

చందుర్తి: జాతీయ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు మల్యాల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల తొమ్మిదోతరగతి విద్యార్థిని శ్రీదర్ల దీక్షిత ఎంపికవగా.. రుద్రంగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఈసరి శ్రీనివాస్ మెమొంటో అందజేసి అభినందించారు.

విచ్చలవిడిగా ప్లాస్టిక్ వాడకం

- అవగాహన ఉన్నా.. ఆచరణ శూన్యం
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



వేములవాడ కూరగాయల మార్కెట్‌లో ప్లాస్టిక్ కవర్లలో కూరగాయలు

వేములవాడఅర్బన్: పట్టణంలో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ భూతం కనిపిస్తోంది. ప్లాస్టిక్ వాడొద్దని తెలిసినా ఆచరించడం లేదు. మున్సిపల్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. పట్టణంలో ఏ దుకాణంలోకి వెళ్లినా ప్లాస్టిక్ కవర్లోని తినే వస్తువులందిస్తున్నారు. దుకాణాలు, మార్కెట్‌లో ప్లాస్టిక్ కవర్లు నియంత్రణ చేస్తే ప్రజలు ఇంటి నుంచే బట్ట బ్యాగులను తీసుకెళ్తారు. పట్టణంలో కొద్ది రోజులు ప్లాస్టిక్ వాడకం బంద్ చేశారు. కానీ ఇటీవల కాలంలో మళ్లీ ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కవర్లు కనిపిస్తున్నాయి.

ఎక్కడ చూసినా..
వేములవాడ కూరగాయల మార్కెట్‌లో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కవర్లు కనిపిస్తున్నాయి. నిత్యం తినే కూరగాయలు కూడా ప్లాస్టిక్ కవర్లలోనే తీసుకొచ్చి మార్కెట్ అమ్మకాలు, కొనుగోలు చేస్తున్నారు. గతంలో కూరగయల మార్కెట్‌లో కూరగాయలను గోనె సంచుల్లో తీసుకొచ్చి అమ్మకాలు జరిపేవారు. ప్రస్తుతం సులువుగా ఉండేందుకు గోనే సంచులకు బదులు ప్లాస్టిక్ కవర్లలో రవాణా చేస్తున్నారు. మార్కెట్‌లో కూరగాయలు, పండ్లు, మటన్, చికెన్, చేపలు ప్లాస్టిక్ కవర్లలో ఇస్తున్నారు. ప్లాస్టిక్ వాడకంతో క్యాన్సర్ వంటి రోగాలు వస్తున్నాయని వైద్యులు చెబుతున్నా.. వాడకం మాత్రం నియంత్రించడం లేదు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పట్టించుకొని ప్లాస్టిక్ కవర్లు నియంత్రించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ప్రతిరోజు అవగాహన మాత్రమే..
వేములవాడ మున్సిపల్‌కు చెందిన చెత్త బండ్లు ప్రతిరోజు పట్టణంలో చెత్త సేకరణ చేస్తున్నాయి. వాటికి మైకు పెట్టి ఉదయాన్నే కాలనీల్లోని ఇళ్లలో చెత్త సేకరిస్తున్నారు. ఆ చెత్తబండి మైకు మాత్రం మోగుతుంది. చెత్తబండి వచ్చిందమ్మ.. చెత్తను బండికి ఇవ్వండమ్మ.. ప్లాస్టిక్‌ను వాడకండి.. రోగాలను కొని తెచ్చుకోకండమ్మ.. వేములవాడ మున్సిపల్ పరిధిలో ప్లాస్టిక్ నిషేధించబడింది.. ప్లాస్టిక్ కవర్లు అమ్మినా.. కొన్నా.. వాడినా రూ.2వేలు జరిమానా విధించబడును.. అని ప్రతిరోజు కాలనీల్లో మున్సిపల్ వాహనాలు అవగాహన కల్పిస్తున్నా.. ఆచరణ మాత్రం కనిపించడం లేదు.

నివారణకు చర్యలు



వేములవాడ పట్టణంలో ప్లాస్టిక్ కవర్లు వాడొద్దని అవగాహన కల్పించాం. దుకాణాలు, మార్కెట్‌లో వాటి నివారణ కోసం టీమ్‌ను ఏర్పాటు చేసి తనిఖీ చేస్తాం. అమ్మకాలు జరిపితే జరిమానా విధిస్తాం. ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నియంత్రిస్తాం.
– అన్వేశ్, వేములవాడ మున్సిపల్ కమిషనర్

ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం



పెద్దూరు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అక్షరాభ్యాసం

సిరిసిల్ల అర్బన్: పట్టణ పరిధిలోని పెద్దూరు ప్రభుత్వ పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు మోతిలాల్ మాట్లాడుతూ.. ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించామన్నారు. చక్రవర్తుల రమాదేవి, గుండెల్లి రవీందర్, తోట శ్రీనివాస్, మాధవి, ఉమ, బైరి వాణిశ్రీ, కల్పన, వీణ తదితరులు పాల్గొన్నారు.
ఇల్లంతకుంట: కందికట్కూర్, పాత్తూరు, ఇల్లంతకుంట తదితర ప్రభుత్వ పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. కందికట్కూర్ హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో పాల్గొన్న మండల విద్యాధికారి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. పావని, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
గంభీరావుపేట: గజసింగవరం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో గంగారాం, ప్రధానోపాధ్యాయుడు రవి, స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ బాల ఎల్లయ్య, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.
వీర్నపల్లి: మండల కేంద్రంలోని పీఎంశ్రీ ఎంపీపీఎస్ వీర్నపల్లి పాఠశాల ప్రాంగణంలో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని మండల విద్యాధికారి తుమ్మ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

అంగన్‌వాడీ ర్యాలీ



ఇల్లంతకుంటలో విద్యార్థుల ర్యాలీ

ఇల్లంతకుంట: మండల కేంద్రంలో శుక్రవారం అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులతోపాటు ఇల్లంతకుంటలోని మూడు అంగన్‌వాడీ సెంటర్ల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. 3 ఏళ్లు దాటిన పిల్లలను పంపించాలని అంగన్వాడీ సెక్టర్ సూపర్‌వైజర్ చంద్రకళ తల్లిదండ్రులను కోరారు. ఉపాధ్యాయుడు ఆగయ్య, అంగన్‌వాడీ టీచర్లు అరుణ, విజయ తదితరులు పాల్గొన్నారు.

చదువులో రాణించాలి



సిరిసిల్ల అర్బన్: విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న సూర దేవరాజు, నాయకులు

సిరిసిల్ల అర్బన్: విద్యార్థులు క్రమశిక్షణతోపాటు చదువులో రాణించాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు అన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని 12వ వార్డు చంద్రంపేటలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం నుంచి వచ్చిన సమ వస్త్రాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయురాలు పద్మజ, సత్యనారాయణ, నాగభూషణం, కత్తెరపాక ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.
పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పూర్వ విద్యార్థులు సమకూర్చిన స్కూల్ బ్యాగులు, పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాం ప్రధానోపాధ్యాయుడు చకినాల శ్రీనివాస్ అందజేశారు.
సిరిసిల్లకల్చరల్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పేద విద్యార్థుల కోసం శుక్రవారం స్కూల్ బ్యాగులను వితరణ చేశారు. పూర్వ విద్యార్థులు మ్యాన శ్రీధర్, మదన్‌కుమార్, చేరాల నారాయణ, నాగుల మరేందర్, సురేశ్, మల్లేశం, ఈశ్వర్, రమేశ్ తదితరులు బ్యాగులతోపాటు పాఠ్య, నోట్ పుస్తకాలు, యునిఫాం అందజేశారు.
కోనరావుపేట: రామన్నపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నూతన విద్యాభ్యాసం సందర్భంగా విద్యార్థులకు యూనిఫాం, పాఠ్య పుస్తకాలు అందజేశారు. అక్షరాభ్యాసం చేయించారు.
వీర్నపల్లి: మద్దిమల్ల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏకరూప దుస్తులు, పాఠ్య, నోట్ పుస్తకాలను ఏఎంసీ డైరెక్టర్ దేవయ్య అందజేశారు.
తంగళ్లపల్లి: గండిలచ్చపేట గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. హెచ్ఎం దూస శ్రీనివాస్ మాట్లాడారు. మాజీ సర్పంచ్ నీరటి లక్ష్మి, సింగిల్విండో డైరెక్టర్ బండి దేవేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



ఎంఈవోకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలో నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలు అమ్ముతూ, అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు ఓ పాఠశాల ఎదుట శుక్రవారం ఆందోళన చేశారు. మండల విద్యాధికారి కృష్ణహరికి ఫిర్యాదు చేశారు. బీజేపీ యువ మోర్చా మండల అధ్యక్షుడు దయాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల పేరుతో అధిక ధరలకు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అంటగడుతూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. నాయకులు బొమ్మడి స్వామి, నవీన్, చరణ్‌గౌడ్, తిరుపతిగౌడ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీపై నియంత్రణేది..?

సిరిసిల్లటౌన్: యథేచ్ఛగా సాగుతున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీపై ప్రభుత్వ నియంత్రణేదని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీశ్ ప్రశ్నించారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాయకులు ఎస్‌కే బాబా, మెట్టల సాయి, దీపక్, వెంకటరమణ, అశోక్ తదితరులున్నారు.

క్రీడలకు ఒరవడి.. కొత్తపల్లి బడి



రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించిన విద్యార్థులు

గంభీరావుపేట: కొత్తపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల.. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే క్రీడాకారులకు పెట్టింది పేరు. ఈ పాఠశాల విద్యార్థులు క్రీడల్లో విశేష ప్రతిభ కనబరుస్తున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో విజయాలు సాధించి సత్తా చాటుతున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల క్రీడాప్రతిభను గుర్తించి తగిన శిక్షణనిస్తున్నారు. విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతోపాటు భవిష్యత్‌లో వారి కెరీర్‌కు బలమైన పునాదిగా మారనుంది. విద్యార్థుల్లో శారీరక దారుఢ్యం, క్రీడాస్ఫూర్తి, సమూహ పని నైపుణ్యాలు వంటి అంశాలను ప్రోత్సహించడంలో కొత్తపల్లి బడి ముందు వరుసలో ఉందని చెప్పొచ్చు. ఈ పాఠశాల నుంచి గడిచిన విద్యాసంవత్సరంలో 26 మంది జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో ప్రాతినిథ్యం వహించిన విద్యార్థులున్నారు. హ్యాండ్‌బాల్, త్రోబాల్, ఉషూ, ఖోఖో వంటి క్రీడల్లో చక్కటి ప్రతిభ కనబర్చి అవార్డులను కైవసం చేసుకున్నారు.

కాంగ్రెస్‌లోకి 'కట్కూరి'..?



ఇటీవల విప్‌తో శ్రీనివాస్

వేములవాడ: వేములవాడ మాజీ సర్పంచ్, తాజా మాజీ మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ కట్కూరి శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో శనివారం చేరేందుకు సన్నాహాలు పూర్తి చేసుకున్నారు. పట్టణ ఆర్యవైశ్యుల్లో రాజకీయంగా కాస్త ఎదుగుదల ఉన్న నాయకుడిగా చలామణిలో ఉన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన కట్కూరి శ్రీనివాస్ ప్రస్తుతం బీఆర్ఎస్‌లో కొనసాగుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కట్కూరి శ్రీనివాస్ కాంగ్రెస్‌లో చేరడం పట్టణంలో చర్చనీయాంశమైంది.

క్రీడల్లో రాణిస్తే మంచి గుర్తింపు



బహుమతి ప్రదానం చేస్తున్న విప్, నాయకులు

చందుర్తి: క్రీడల్లో రాణిస్తే మంచి గుర్తింపు లభిస్తుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మూడపల్లి గ్రామంలో నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా విలేజ్ టు విలేజ్ క్రికెట్ టోర్నమెంటు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేత తంగళ్లపల్లి, రన్నర్ మూడపల్లి జట్లకు బహుమతులను ప్రదానం చేశారు. మాజీ జెడ్పీటీసీ సభ్యులు నాగం కుమార్, చందుర్తి సింగిల్‌విండో ఉపాధ్యక్షుడు పుల్కం మోహన్, నాయకులు బద్దం తిరుమల్‌రెడ్డి, ప్రసాద్, పుల్కం లచ్చయ్య, బానాల రవీందర్‌రెడ్డి, మేకల గణేశ్, క్రీడాకారులు పాల్గొన్నారు.
ఎల్లారెడ్డిపేట: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే క్రీడలతో క్రీడాకారుల మధ్య స్నేహభావం పెంపొందుతుందని కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు అన్నారు. బండలింగంపల్లిలో బాల్‌రాజ్ బాలనర్సాగౌడ్ స్మారక జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. సర్దాపూర్ పోలీస్ బెటాలియన్‌కు చెందిన జట్టు విజేతగా నిలిచింది. బండలింగంపల్లి ఆర్గనైజర్ జట్టు ద్వితీయ స్థానం సాధించింది. విజేతకు రూ.20వేల నగదు, షీల్డ్, రన్నర్‌కు రూ.10వేల నగదు, షీల్డ్‌ను రవీందర్‌రావు చేతుల మీదుగా అందజేశారు.

అర్హులందరికీ రైతు భరోసా

ముస్తాబాద్: వానాకాలం పంటల సాగులో అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం రైతు భరోసా అందజేస్తుందని మండల వ్యవసాయాధికారి దుర్గరాజు తెలిపారు. రైతు బ్యాంకు ఖాతాల్లోనే జమవుతుందన్నారు.

సోదాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు



ఎల్లారెడ్డిపేట: రాచర్లబొప్పాపూర్‌లోని యాదవ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సొడాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయం యాదవులు ఇంటికో బోనం చొప్పున తీసి ఊరేగింపు నిర్వహించారు. కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి హాజరై అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆర్‌వైవీ పథకం అమలు చేయాలి

సిరిసిల్లటౌన్: యువతకు ఉపాధి కల్పించే రాజీవ్ యువ వికాసం పథకాన్ని వెంటనే అమలు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి కోరారు. శుక్రవారం స్థానిక కార్మిక భవనంలో నిర్వహించిన ప్రెస్ మీట్లో మాట్లాడారు.

'ఆది'కి మంత్రివర్గంలో చోటు కల్పించాలి
రుద్రంగి: ఆది శ్రీనివాస్‌కు మంత్రివర్గంలో చోటు కల్పించాలని ఏఎంసీ చైర్మన్ చెలుకల తిరుపతి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.

మహాసభను విజయవంతం చేయండి
తంగళ్లపల్లి: ఇందిరమ్మకాలనీలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు ఆధ్వర్యంలో శుక్రవారం సీపీఐ నాలుగో మహాసభ సన్నాహక సమావేశం నిర్వహించారు. మహాసభ ఈనెల 16న జిల్లాకేంద్రంలోని లహరి ఫంక్షన్ హాలులో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మిక, కర్షకులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.



బోయినపల్లి: మండల కేంద్రంలో పోస్టు ఆఫీస్, యూనియన్ బ్యాంకు మూల వద్ద ఉన్న విద్యుత్ పోల్ ప్రమాదకరంగా మారింది. మలుపులో పోల్ ఉండడంతో.. సెస్ అధికారులు పోల్‌కున్న విద్యుత్ తీగలు తీసేయడంతోపాటు కరెంట్ కనెక్షన్ తొలగించారు. ఐతే నెలలు గడుస్తున్నా పోల్ తొలగించడం లేదు. వెంటనే పోల్ తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
జి.ప్రశాంత్, సెస్, ఏఈ,
బోయినపల్లి, సెల్ నంబర్:
9440814076

వాట్సాప్ చేయండి..
మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.
మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626



రాజన్న దర్శనానికి వరుసలో భక్తులు

భక్తుల కోలాహలం

వేములవాడ: రాజన్నను శుక్రవారం 15వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో పుణ్యస్నానాలు చేసిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల ద్వారా రూ.18లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.
ఈవోకు వీడ్కోలు
ఆలయ ఈవోగా విధులు నిర్వహించి శుక్రవారం బదిలీపై వెళ్లిన కొప్పుల వినోద్‌రెడ్డికి ఉద్యోగులు, అర్చకులు వీడ్కోలు పలికారు. నూతన ఈవో రాధాబాయికి బాధ్యతలు అప్పగించిన అనంతరం రాజన్నను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు, అధికారులు శాలువాతో సత్కరించారు.

ప్రతీ గ్రామంలో జెండా పండుగ జరుపుకోవాలి



సిరిసిల్ల అర్బన్: భూమిపూజ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సిరిసిల్ల అర్బన్: పట్టణ పరిధిలోని 22వ వార్డు పెద్ద బోనాలలో ఎమ్మార్పీఎస్ జెండా గద్దెకు జిల్లా ఇన్‌చార్జి పుట్ట రవిమాదిగ శుక్రవారం భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో జెండా పండుగను జరుపుకోవాలన్నారు. పంగ తిరుపతి, లక్ష్మణ్, చంద్రమౌళి, పంగ రవి, రాజలింగం, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.
ఇల్లంతకుంట: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దిన వేడుకలు జూలై 7న ఘనంగా నిర్వహించాలని జిల్లా ఇన్‌చార్జి నాయకుడు పుట్ట రవి అన్నారు. మండల కేంద్రంలోని వైశ్య భవన్లో మండల ఎమ్మార్పీఎస్ సంఘ సమావేశం శుక్రవారం నిర్వహించగా.. ఆయన పాల్గొన్నారు. మంద రాజు, కాణారపు లక్ష్మణ్, గుండెటి రాజు, చంద్రమౌళి, పసుల వెంకటి, తడకపల్లి భూమయ్య, గన్నారం నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

యాదవులు అన్ని రంగాల్లో రాణించాలి



వెంకట్‌కు విన్నవిస్తున్న నేతలు

సిరిసిల్లటౌన్: యాదవులు అన్ని రంగాల్లో రాణించాలని యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలగాని వెంకట్ కోరారు. సిరిసిల్లలో శుక్రవారం నిర్వహించిన వేదిక జిల్లా సమావేశంలో మాట్లాడారు. యాదవులు రాజకీయ, సామాజిక, ఉద్యోగాలు, ఉపాధి రంగాల్లో ముందుండాలన్నారు. యాదవ విద్యార్థుల్లో ప్రతిభావంతులను ఏటా సన్మానించుకోవాలన్నారు. అనంతరం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొబ్బల మల్లేశ్, ప్రధాన కార్యదర్శి బత్తుల మహేందర్, న్యాయవిభాగం అధ్యక్షుడు యమున, గౌరవ సలహాదారులుగా శ్రీనివాస్, రాములు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు పోచబోయిన శ్రీహరి, వీరవేని మల్లేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భూభారతిపై అవగాహన పెంచుకోవాలి

ఎల్లారెడ్డిపేట: రైతులందరూ భూభారతి చట్టంపై అవగాహన పెంచుకోవాలని, అప్పుడే భూమి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ సుజాత, ఏఎంసీ చైర్మన్ సాబేరా బేగం అన్నారు. రాచర్లబొప్పాపూర్‌లోని రైతు వేదిక వద్ద, కోరుట్లపేటలో భూభారతిపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీటీ మురళీకృష్ణ, ఆర్ఐ శ్రావణ్, ఏఎంసీ వైస్ చైర్మన్ గుండాడి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.
తంగళ్లపల్లి: భూభారతి రెవెన్యూ సదస్సులు మండలంలో శుక్రవారంతో ముగిసినట్లు తహసీల్దార్ జయంత్‌కుమార్ తెలిపారు. తాడూర్ గ్రామంలో రైతుల నుంచి చివరి రోజు దరఖాస్తులు స్వీకరించారు.
ఇల్లంతకుంట: రేపాక, రంగంపేట గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తహసీల్దార్ ఎంఏ ఫరూక్ తెలిపారు.
చందుర్తి: భూసమస్యలతో ఇబ్బంది పడుతున్న రైతుల సమస్యలకు పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం భూభారతి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి అన్నారు. కొత్తపేటలో నిర్వహించిన సదస్సుకు హాజరయ్యారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత, ఆర్ఐ మహేందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

వేములవాడరూరల్: చెక్కపల్లి గ్రామ పంచాయతీలో శుక్రవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించారు. రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు ప్రియదర్శిని, వెంకట్రామ్ మాట్లాడారు. వ్యవసాయ విస్తరణ అధికారి అనుష తదితరులున్నారు.
బద్దెనపల్లిలో..
తంగళ్లపల్లి: బద్దెనపల్లి గ్రామంలో బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. అసోసియేట్ డీన్ డా.సునీతాదేవి మాట్లాడారు. డా.రాజేందర్, కె.సంజీవ్, వి.గోవర్ధన్, సంతోష్, గౌతమి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.